
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 320 | పేజీలు: 4 | వెల: 4/- | శనివారం ● 01, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు

- ప్రత్యేక విమానంలో వంద టన్నుల బంగారం రాక
- భారీ బందోబస్తు మధ్య తరలించిన ఆర్‌బిఐ

**ముంబయి,మే31(నమస్తే ఉదయం):** ఇంగ్లాండ్ నుంచి భారీఎత్తున బంగారం నిల్వలను ఆర్‌బీఐ భారత్‌కు తరలించింది. దాదాపు 100 టన్నులు అంటే

మిగతా.. 2లో

## సూర్య ప్రతాపం...

### దేశవ్యాప్తంగా మండుతున్న ఎండలు

- నాగ్‌పుర్‌లో అత్యధికంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వడదెబ్బకు దేశవ్యాప్తంగా 54 మంది మృతి

**నాగ్‌పుర్,మే31(నమస్తే ఉదయం):** దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలతో సూర్యుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మొన్నటికి మొన్న దేశ రాజధాని దిల్లీలో అత్యధికంగా 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. ఆ ఉష్ణోగ్రతను దాటి ఇప్పుడు మహారాష్ట్రలోని నాగ్‌పుర్ లో ఏకంగా 56 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పుర్‌లో భారత వాతావరణ విభాగం నాలుగు ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్‌ను ఏర్పాటుచేసింది. ఇందులో రెండింట గురువారం అసాధారణ ఉష్ణోగ్రతలు చూపించాయి. సోనేగావ్‌లోని ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌లో 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా..

మిగతా.. 2లో



## అట్టహాసంగా దశాబ్ది వేడుకల ఏర్పాట్లు

- ట్యాంక్‌బండ్, పరేడ్ గ్రౌండ్స్‌లో ముమ్మరంగా పనులు
- నేటి సాయంత్రమే ట్యాంక్‌బండ్‌పై ఫుడ్ కోర్టులు
- అధికారులతో కసలి ఏర్పాట్లను పరిశీలించిన సిఎస్

**హైదరాబాద్,మే31(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ట్యాంక్‌బండ్‌తో పాటు సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జూన్2వ తేదీన రాష్ట్ర దశాబ్ది వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం, సాయంత్రం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోలీసులు రిహార్సల్స్

మిగతా.. 2లో





### నేటి సాయంత్రం 6.30 తరవాతే

## ఎగ్జిట్ పోల్స్

- కీలక ఆదేశాలు జారీ చేసిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,మే31(నమస్తే ఉదయం):** దేశవ్యాప్తంగా శనివారం వెలువడబోయే ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ తరుణంలో శుక్రవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసింది. నేటితో లోక్‌సభ ఎన్నికల చివరిదశ పోలింగ్ ముగియనుంది. దీంతో శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడాల్సి ఉంది. అయితే.. నిర్ణీత సమయం కంటే ముందు ఫలితాలను ఇవ్వకూడదని ఈసీ తాజాగా ఆదేశాలు విడుదల చేసింది. జూన్ 1వ తేదీ శనివారం సాయంత్రం 6:30 తరువాతే ఎగ్జిట్ పోల్స్ విడుదల చేయాలని తెలిపింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాల్సిందేనని తాజా ఆదేశాల్లో ఈసీ పేర్కొంది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిషా, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు,అలాగే దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లోని 25 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరిగాయి. అయితే వీటన్నింటికి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ఈసీ బ్యాన్ చేసింది. పూర్తి స్థాయిలో అంతటా పోలింగ్ ముగిసిన తర్వాతే వెల్లడించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్లకు మార్చి 28వ తేదీ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈసీ స్పష్టంగా పేర్కొంది.



## నేడే ఆఖరి పోరు..

- 57 నియోజకవర్గాలకు ఎన్నికలు
- బరిలో 904 మంది అభ్యర్థులు
- 10.06 కోట్ల మంది ఓటర్లు
- 6:30కు వెలువడనున్న ఎగ్జిట్ పోల్స్
- జూన్ 4న ఫలితాల ప్రకటన

**వారణాసి/చండీగఢ్, మే 31:** లోక్‌సభ చివరి దశ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 57 నియోజకవర్గాలకు శనివారం పోలింగ్ జరగనుంది. 904 మంది అభ్యర్థులు ఈ విడతలో పోటీ పడుతున్నారు. మొత్తం 10.06 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 5.24 కోట్ల మంది పురుషులు, 4.82 కోట్ల మంది మహిళలు, 3,574 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న నాలుగు స్థానాలకు, యూపీలో 13, పశ్చిమ బెంగాల్‌లో తొమ్మిది, బీహార్‌లో ఎనిమిది, ఒడిశాలో ఆరు, జారండ్‌లో మూడు స్థానాలతో పాటు చండీగఢ్ స్థానానికి పోలింగ్ జరగనుంది. వీటితో పాటు ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 42 స్థానాలకు, హిమాచల్ ప్రదేశ్‌లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా జరగనున్నాయి. జూన్ 4న ఫలితాలు

మిగతా.. 2లో

## జూన్ 7,8న ప్రపంచ వరి సదస్సు

- దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా సదస్సు
- తాజ్‌కృష్ణా హెూటల్‌లో సదస్సు నిర్వహణ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

**హైదరాబాద్,మే31(నమస్తే ఉదయం):** దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ వరి సదస్సును జూన్ 7, 8వ తేదీల్లో తాజ్ కృష్ణా హెూటల్‌లో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి



తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఫిలిఫైన్స్) సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో 28 దేశాల నుంచి దాదాపు 500 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యాపారులు, అనుబంధ రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. వివిధ దేశాల నుంచి వరి శాస్త్రవేత్తలు ఈ వరి సదస్సులో పాల్గొనే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ప్రపంచ వరి సదస్సుకు సన్నాహాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ సదస్సులో వరి రకాల ప్రదర్శనతో పాటు రాష్ట్రానికి

మిగతా.. 2లో

### ఈ ఎన్నికల్లో ప్రజల ఓటు

## ఇండియా కూటమికే...

- బహిరంగ ధ్యానంతో ప్రజాధనం వృధా
- విశ్వాసం ఉంటే ఇంట్లోనే ధ్యానం చేయొచ్చు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భరోసా

**న్యూఢిల్లీ,మే31(నమస్తే ఉదయం):** కన్యాకుమారిలోని ధ్యానమందిరంలో జూన్ 1వ తేదీ వరకూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యానంలో కూర్చోనుండటంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం విమర్శలు గుప్పించారు. రాజకీయాలను మతంతో ముడిపెట్టడం సరికాదన్నారు. భగవంతుడి మీద అంతగా విశ్వాసం ఉంటే ఆ ధ్యానం ఏదో ఇంట్లోనే కూర్చుని చేసుకోవచ్చని వ్యాఖ్యానించారు. దీనికి ఇంతగా ప్రచారం చేసుకోవాలా అని మండిపడ్డారు. రాజకీయాలు, మతం రెండింటినీ ఒకే గాట కట్టరాదు. వేర్వేరుగానే వాటిని ఉంచాలి. ఒక మతానికి చెందిన వ్యక్తి మీతో ఉండొచ్చు, మరొకరు మీకు దూరంగా ఉండొచ్చు. మతపరమైన భావోద్వేగాలను ఎన్నికలతో ముడిపెట్టరాదన్నారు. మోదీ కన్యాకుమారి వెళ్లి డ్రామా ఆడబోతున్నారు. ఇందుకోసం భారీగా పోలీసు అధికారులను విధుల్లో ఉంచాల్సి వస్తుంది. తద్వారా ఎంతో ప్రజాధనం వృథా అవుతుంది. మీరు చేసే 'షో' వల్ల దేశానికి కీడు జరుగుతుంది. మీకు భగవంతుడి మీద విశ్వాసం ఉంటే ఆ పనేదే ఉంట్లోనే చేసుకోవచ్చని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

మిగతా.. 2లో





## ఐదేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం

- సీనియర్ ఐపిఎస్ ఎబివికి ఎట్టకేలకు పోస్టింగ్
- ఉదయం జాయినింగ్..సాయంత్రం రిటైర్‌మెంట్

**అమరావతి,మే31(నమస్తే ఉదయం):** ఎట్టకేలకు ఐదేళ్ల వేధింపుల తరవాత..సీనియర్ పోలీస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావుకు ఏపీ ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా ఆయనను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్ట్ ఉత్తర్వులు మేరకు శుక్రవారం ఉదయం వెంకటేశ్వర రావుపై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం ఎత్తివేసింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు మేరకు మొదటిసారి సస్పెన్షన్ ఎత్తివేసి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అప్పుడు కూడా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా పోస్టింగ్ ఇచ్చింది. మళ్ళీ ఇప్పుడు కూడా


మిగతా.. 2లో

## ఉద్యోగుల జీవితాలతో చెలగాటం

- కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం రద్దుపై మౌనం
- ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోని వైనం
- ఉద్యోగులకు లేని పెన్షన్ ప్రజాప్రతినిధులకు ఎందుకు..?

**న్యూఢిల్లీ,మే31(నమస్తే ఉదయం):** కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) రద్దు కోరుతూ ప్రభుత్వోద్యోగులు ఉద్యమం దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోని మొద్దు నిద్రలో ప్రభుత్వాలు ఉన్నాయి. కనీసం తెలుగు రాష్ట్రాల్లో అయినా ఈ సమస్యకు పరిష్కారం కనుగొని ఉంటే బాగుండేది. ఇందులో టీచర్లు కూడా ఉన్నారు. దేశానికి దిశానిర్దేశం చేస్తున్న టీచర్లకు మన్నశ్శాంతి

మిగతా.. 2లో



## మళ్లీ జైలుకు వెళుతున్నా...

- నేటితో ముగియనున్న కేజ్రీవాల్ బెయిల్
- వీడియో విడుదల చేసిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ,మే31(నమస్తే ఉదయం):** ఢిల్లీ సీఎం కేజీవ్రాల్ ఓ వీడియో రిలీజ్‌చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో బెయిల్ మీద బయటకు వచ్చిన ఆయన.. జూన్ రెండో తేదీన సరెండర్ కానున్నట్లు చెప్పారు. మళ్లీ తీహార్ జైలుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌తో లింకున్న మనీ ల్యాండరింగ్ కేసులో కేజ్రీని

మిగతా.. 2లో



### ఉద్యోగుల జీవితాలతో
# చెలగాటం

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా పాఠాలు చెప్పడం సాధ్యమా అన్నది ఆలోచన చేయాలి. 2004 జనవరి 1 నుంచి నూతన పెన్షన్ పథకం పేరుతో సిపిఎస్‌ను అమల్లోకి తెచ్చింది. అనంతరం యుపిఎ-1 సర్కారు పిఎఫ్ఆర్‌డిఎకి చట్టబద్ధత కల్పించారు. ప్రజాప్రతినిధులకు పెన్షన్లు, సౌకర్యాలు కల్పించుకుంటున్న దశలోఉద్యోగుల పట్ల నిర్దయగా వ్యవహరించడం ఎంతవరకు సమంజమో ఆలోచన చేయడం లేదు. సిపిఎస్ రద్దు కోరుతూ అఖిల భారత స్థాయిలో ఇప్పటికే తీవ్రస్థాయి లో సమ్మెలు జరిగాయి. సిపిఎస్ పరిధిలో దేశ వ్యాప్తంగా 56 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో ఐక్య ఉద్యమాలు జోరందుకున్నాయి. వివిధ స్థాయిల్లో ధర్నాలు, సదస్సులు, చలో అసెంబ్లీ తదితర రూపాల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు తమ భవిష్యత్తుపై ప్రభుత్వాన్ని నిలదీస్తు న్నాయి. ఉద్యోగులు రిటైరయ్యాక గౌరవ ప్రదంగా కనీస జీవనం సాగించడానికి ప్రభుత్వాలు పూచీ పడటం కనీస ధర్మం. సుప్రీం కోర్టు సైతం అదే చెప్పింది. పెన్షన్ అనేది సామాజిక భద్రతాంశం. ఖజానాకు భారం అన్న పేరుతో దాన్ని ప్రభుత్వాలు వదిలించుకోవాలను కోవడం సరికాదు. ఉద్యోగుల ఆందోళనల ఫలితంగా కేంద్రం గ్రాట్యుటి ఉత్తర్వులిచ్చింది. ఎపి సైతం గ్రాట్యుటి, కుటుంబ పెన్షన్‌కు అవకాశం కల్పించినా ఉద్యోగులు దాచుకున్న మొత్తాన్నీ తిరిగి ఇవ్వాలని మెలిక పెట్టింది. సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగులు ఐక్య ఉద్యమాలు నిర్మించినప్పుడే ప్రభుత్వాలు దిగి వస్తాయని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఇరు రాజధానుల్లో వరుసగా నిరసన ప్రదర్శనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం తప్ప చేసిందేమీ లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పోరాటాలు అణచి వేయడం తప్ప సమ్యలను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదు. వీంతా బలమైన ఐక్యసంఘటనలుగా ఏర్పడి పోరాడుతూనే ఉన్నారు. సిపిఎస్ అమల్లోకొచ్చి దశాబ్దంన్నర కావస్తోంది. ప్రస్తుతం ఎపిలో అధికార, ప్రతిపక్షాలుగా ఉన్న టిడిపి, వైసిపిలు దానికి అనుకూలంగా నిలిచాయి. 2004 సెప్టెంబర్ నుంచే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం తెచ్చి మరీ సిపిఎస్‌ను అమల్లో పెట్టింది. వామపక్షాలు అధికారంలో ఉన్న కేరళ, త్రిపుర, బెంగాల్‌లో మాత్రమే అప్పుడు సిపిఎస్ అమలు కాలేదు. సిపిఎస్ అనేది ఉద్యోగులకు ఏ మాత్రం భరోసా లేని గందరగోళ వ్యవహారం. ఉద్యోగుల జీతాల్లో నెలకు పదిశాతం మినహాయించుకొని అంతే మొత్తంలో ప్రభుత్వం తన వాటాను జత చేస్తుంది. వాటితో ఉద్యోగులు రిటైరయ్యాక పెన్షన్ ఇస్తారు. పెన్షన్ ఎంత వస్తుందో తెలీదు. కనీస సమాచారం ఇచ్చే కార్యాలయం రాష్ట్రంలో లేదు. పైపెచ్చు సిపిఎస్ నిధులను షేర్ మార్కెట్‌లో పెడతారని సమచారం. ప్రపంచ ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఏ క్షణం షేర్ మార్కెట్ పుంజుకుంటుందో ఏ క్షణం కుప్పకూలుతుందో తెలీదు. రిటైరయ్యాక ఉద్యోగులు దాచుకున్న సొమ్మును తీసుకోవాలంటే 30 శాతం ఆదాయపన్ను కట్టాలనడం మరీ దారుణం. సిపిఎస్ పర్యవసానాలు ఇంత ఘోరంగా ఉన్నందునే ఉద్యోగుల్లో అంతకంతకూ ఆందోళనలు పెల్లుబుకుతున్నాయి. వీటిపై దృష్టి సారించి ఓ నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే.

## మళ్లీ జైలుకు వెళుతున్నా...

(మొదటి పేజీ తరువాయి)

ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమ పార్టీ తరపున ప్రచారం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ పెట్టుకున్నారు. ఆయనకు 21 రోజుల తాత్కాలిక బెయిల్‌ను సుప్రీం జారీ చేసింది. ఆ బెయిల్ గడువు జూన్ ఒకటో తేదీతో ముగియనున్నది.

బెయిల్‌ను పొడిగించాలని పెట్టుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్వీకరించలేదు. దీంతో దారులు మూసుకుపోయాయి. దేశాన్ని నియంతృత్వం నుంచి రక్షించేందుకు మళ్లీ జైలుకు వెళ్లనున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. మళ్లీ జైలుకు వెళ్తే తనను ఎన్ని రోజులు బంధిస్తారో తెలియదన్నారు. జైలులో ఉన్నప్పుడు తనను ఎన్నో విధాలుగా వేధించినట్లు ఆరోపించారు. తనకు మెడిసిన్ ఇవ్వడం ఆపేశారన్నారు. జైలుకు వెళ్లేముందు తన బరువు 70 కేజీలు అని, ఇప్పుడు 64 కేజీలకు చేరుకున్నట్లు వెల్లడించాడు. జైలు నుంచి రిలీజైన తర్వాత కూడా ఇంకా బరువు పెరగలేదన్నాడు. తమ సర్కారు అమలు చేస్తున్న అన్ని స్కీమ్‌లు యధాతథంగా ఉంటాయని, మళ్లీ వచ్చిన తర్వాత ప్రతి మహిళకు వెయ్యి ఇస్తానన్నారు.

## ఐదేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

అదే పోస్టింగ్ ఇచ్చింది.ఈ క్రమంలో ఏబీ వెంకటేశ్వరరావు ఛార్జ్ తీసుకున్నారు. తిరిగి సాయంత్రం పదవీ విరమణ చేయనున్నారు. ఐదేళ్ల క్రితం జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చీ రాగానే.. ఏబీ వెంకటేశ్వరరావుపై ప్రభుత్వం కక్ష గట్టింది. ఆ వెంటనే ఆయనను సస్పెండ్ చేసింది. దీంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. అప్పుడు వెంకటేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తి వేయాలంటే ఏపీ ప్రభుత్వానికి క్యాట్ సూచించింది. దీనిపై జగన్ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. అయితే క్యాట్ ఉత్తర్వులపై జోక్యం చేసుకోబోమని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అలా ఐదేళ్లుగా ఏబీ వెంకటేశ్వరరావు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. ఆయన పోరాటం ఫలించి.. పదవీ విరమణ రోజు విధుల్లో చేరారు. ఈ క్రమంలో జగన్ జగన్ సర్కార్ అనుకున్న విధంగానే ఐదేళ్లు ఆయనను అధికారానికి దూరంగా ఉంచారు. చివరకు పదవీవిరమణ రోజు హైకోర్టులో కూడా వ్యతిరేకంగా నిర్ణయం రావడంతో సర్వీసులోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఏబీవీపై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను ఇటీవల కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఎత్తివేసింది. దీనిని హైకోర్టు కూడా సమర్థించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను సర్వీసులోకి తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్ ఆయనకు పోస్టింగ్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రక్షణ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో వైకాపా ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసింది. డైరెక్టర్ జనరల్ ర్యాంక్ కలిగిన ఆయనకు ఐదేళ్లుగా పోస్టింగ్ ఇవ్వకుండా సస్పెన్షన్ల మీద సస్పెన్షన్లు విధించింది. అక్రమ కేసులతో జగన్ ప్రభుత్వం, వైకాపా వీరభక్త అధికార గణం వేధించింది. ఆ తర్వాత ఏబీవీ క్యాట్‌ను ఆశ్రయించగా.. సస్పెన్షన్‌ను సమర్థించింది. అనంతరం ఆయన హైకోర్టుకు వెళ్లగా.. ఉన్నత న్యాయస్థానం సస్పెన్షన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. సర్వీసులో ఉన్న అధికారిని రెండేళ్ల కంటే ఎక్కువ కాలం సస్పెన్షన్‌లో ఉంచొద్దని ఆదేశిస్తూ.. ఏబీ వెంకటేశ్వరరావుపై ఉన్న సస్పెన్షన్‌ను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఏబీ వెంకటేశ్వరరావుకు పోస్టింగ్ ఇచ్చింది. ఆ తర్వాత కొద్ది రోజులకే గతంలో ఏ కారణంతో సస్పెండ్ చేశారో.. తిరిగి అదే కారణంతో మరోసారి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఏబీవీ సస్పెన్షన్ చెల్లదని, ఆయన్ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్) ఈ నెల 8న ఆదేశాలిచ్చింది. 22 రోజులు గడిచినా విధుల్లోకి తీసుకోలేదు సరికదా.. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. క్యాట్ ఆదేశాల నిలుపుదలకు నిరాకరిస్తూ ఏపీ హైకోర్టు గురువారం ఉత్తర్వులిచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులను సీఎస్ జవహర్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలోనూ ఏబీ వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ఆయన్ను సర్వీసులోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

### ఈ ఎన్నికల్లో ప్రజల ఓటు
# ఇండియా కూటమికే...

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ ఏమి చెప్పినప్పటికీ దేశ ప్రజలు మాత్రం ఆయన నాయకత్వాన్ని అంగీకరించరాదనే నిర్ణయానికి వచ్చినట్టు ఖర్గే తెలిపారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఈ ఎన్నికల్లో ప్రధానాంశాలుగా ఉన్నాయన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాలు ప్రజల మనసుల్లో ఉన్నాయి. ఆంధ్రాలో బీజేపీ కొన్ని సీట్లు గెలుచుకోవచ్చు, కానీ తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు అడ్వాంటేజ్ ఉంది. యూపీలో కూడా కూటమి కారణంగా మాకు మరిన్ని సీట్లు వస్తాయని ఆయన చెప్పారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. రిజర్వేషన్లకు చరమ గీతం పాడాలని బీజేపీ అనుకుంటున్నట్టు ప్రజలు గ్రహించారని ఖర్గే చెప్పారు. వారి ఉద్దేశం మంచిదైతే 30 లక్షల కేంద్ర ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేసేవారని, వాటిలో సగం ఉద్యోగాలు పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలకు వచ్చేవని అన్నారు. 1982లో 'గాంధీ' సినిమా వచ్చేంత వరకూ ప్రపంచానికి గాంధీజీ గురించి తెలియదంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఖర్గే మండిపడ్డారు. గుజరాత్‌కు చెందిన వ్యక్తికే గాంధీజీ గురించి తెలియదంటే ఏమి చెప్పాలి? జాతిపిత గాంధీజీ గురించి మీరు ఎందుకు ప్రమోట్ చేయలేదు అని ప్రశ్నించారు. మీరు గుజరాతీ కూడా. మీకు గౌరవం ఇస్తున్నాం. మీరు మాత్రం గాడ్సే ఐడియాలజీతో వెళ్లాలనుకుంటున్నారని ఖర్గే నిశిత విమర్శ చేశారు.

# నేడే ఆఖరి పోరు..

(మొదటి పేజీ తరువాయి)

వెలువడనున్నాయి. కాగా, శనివారం సాయంత్రం 6.30 తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడి కానున్నాయి. న్నారు. బెంగాల్‌లోని డైమండ్ హార్బర్ నుంచి తృణమూల్ తరపున మమతా బెనర్జీ మేనల్లుడు, హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ నుంచి కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్, మండి నుంచి నటి



#### అందరి ఆసక్తి ఈ స్థానాలపైనే

ఏడో విడతలో పోలింగ్ జరగనున్న వాటిలో పలు కీలక నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది ప్రధాని పోటీ చేస్తున్న వారణాసి. ఇక్కడ కాంగ్రెస్ నుంచి అజయ్ రాయ్, బీఎస్పీ నుంచి అతెర్ జమల్ లరి పోటీ చేస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన కొలిశెట్టి శివకుమార్ కూడా యుగతులసి పార్టీ తరపున బరిలో ఉన్నారు. యూపీలోనే కేంద్రమంత్రులు మహేంద్రనాథ్ పాండే(చందౌలి), పంకజ్ చౌదరి (మహరాజ్‌గంజ్), అనుప్రియా పటేల్(మిర్జాపూర్) సైతం ఈ దఫాలో తమ అదృష్టం పరీక్షించుకుంటు కంగనా రనౌత్ బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు.

#### ఎగ్జిట్‌పోల్స్‌పై ఉత్కంఠ

శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి. ఎన్నికల ఫలితాల వెల్లడికి మరో మూడు రోజులు గడువు ఉన్న నేపథ్యంలో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అయితే ఎగ్జిట్ పోల్ ఫలితాలపై వివిధ టీవీ చానళ్లు నిర్వహించే చర్చల్లో పాల్గొనరాదని కాంగ్రెస్ నిర్ణయించింది. ఊహాగానాలు, టీఆర్‌పీల కోసం బురద జల్లుడు వ్యవహారాల్లో పాల్గొనబోమని పేర్కొన్నది.

## ఇంగ్లండ్ నుంచి బంగారం తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

లక్ష కిలోల పసిడిని దేశీయ ఖజానాలో చేర్చింది. 1991 తర్వాత ఈ స్థాయిలో బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. అప్పట్లో ఆర్థిక సంక్షోభం కారణంగా భారత్ పెద్దఎత్తున పసిడి నిల్వలను తనఖా పెట్టాల్సివచ్చింది. రవాణా, నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్ ఇంతమొత్తం బంగారాన్ని తీసుకొచ్చింది. దేశీయంగా ముంబయి మింట్ రోడ్డు సహా నాగ్‌పుర్‌లోని పాత కార్యాలయాల్లో ఆర్‌బీఐ పుత్తడిని నిల్వ చేస్తుంటుంది. కొన్నేళ్లుగా కేంద్ర రిజర్వ్ బ్యాంకు పెద్దఎత్తున బంగారాన్ని కొనుగోలు చేస్తూ వస్తోంది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనేది ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో విదేశాల్లోని మన నిల్వలు గణనీయంగా పెరిగాయి. దీంతో కొంత మొత్తాన్ని భారత్‌కు తీసుకురావాలని నిర్ణయించింది. చాలా దేశాల కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. అదే బాటలో భారత్ సైతం అక్కడి డిపాజిటరీల్లో పెద్దఎత్తున పసిడిని నిల్వ చేస్తూ వచ్చింది. 2024 మార్చి ముగిసేనాటికి ఆర్‌బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. దీంట్లో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. ఇటీవల కొన్నేళ్లుగా వరుసగా కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్‌బీఐ గత ఏడాది 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వల్లో చేర్చింది. ఈ ఏడాది కొనుగోళ్ల జోరు మరింత పెరిగింది. జనవరి- ఏప్రిల్ వ్యవధిలోనే 2023 మొత్తం కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారం కొనుగోలు చేయడం గమనార్హం. రవాణా, భద్రత విషయాలను పరిగణనలోకి తీసుకుంటే 100 టన్నుల బంగారాన్ని భారత్‌కు తరలించడం మామూలు విషయం కాదు. దీనివెనక కొన్ని నెలల కసరత్తు అవసరం. ఆర్‌బీఐ, ఆర్థికశాఖ సహా వివిధ ప్రభుత్వ శాఖలు, స్థానిక యంత్రాంగం మధ్య సమగ్ర సమన్వయం ఉండాలి. ఈ బంగారాన్ని భారత్‌కు తీసుకొచ్చేందుకు తొలుత ఆర్థికశాఖ నుంచి ఆర్‌బీఐ కస్టమ్స్ సుంకం మినహాయింపు తీసుకుంది. సాధారణంగా అన్ని దిగుమతులపై వర్తించే ఐజీఎస్టీ మాత్రం తప్పలేదు. తద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోవాల్సి ఉండటమే దీనికి కారణం. ఇంత పెద్ద మొత్తంలో బంగారాన్ని భారత్‌కు తరలించేందుకు ప్రత్యేక విమానాన్ని ఉపయోగించారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. తాజా తరలింపుతో ఆర్‌బీఐ నిర్వహణ వ్యయాలు స్వల్ప స్థాయిలో తగ్గుతాయి. ఇప్పటి వరకు బంగారం నిల్వ చేసినందుకు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెల్లిస్తూ వచ్చిన రుసుము ఇకపై చెల్లించనక్కరలేదు.

### జూనియర్ కాలేజీలకు
# ముగిసిన సెలవులు
#### నేటి నుంచి ఇంటర్ తరగతులు పునఃప్రారంభం

**హైదరాబాద్,మే31(నమస్తే ఉదయం):** వేసవి సెలవులు ముగియడంతో జూన్ 1 నుంచి జూనియర్ కాలేజీలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి వార్షిక అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు మార్చి 31 నుంచి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. మే 31తో సెలవులు ముగియనున్నాయి. దీంతో శనివారం నుంచి జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. జూనియర్ కాలేజీల పునఃప్రారంభ తేదీ: జూన్ 1గా నిర్ణయించారు. దసరా సెలవులు అక్టోబర్ 10 నుంచి 13 వరకు ఉంటాయి. ఆసరా అనంతరం అక్టోబర్ 13 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. హాఫ్ ఇయర్ పరీక్షలు: నవంబర్ 18 నుంచి 23 వరకు జరుగుతాయి. సంక్రాంతి సెలవులు జనవరి 11, 2025 నుంచి జనవరి 16 వరకు ఇస్తారు. సంక్రాంతి సెలవుల అనంతరం జనవరి 17 నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి. ప్రీ ఫైనల్ పరీక్షలు వచ్చే జనవరి 20 నుంచి 25 వరకు కొనసాగుతాయి. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి మొదటి వారంలో, థియరీ పరీక్షలు మార్చి మొదటి వారంలో ప్రారంభం అవుతాయి. 2024-25 విద్యా సంవత్సరానికి చివరి పని దినం మార్చి 29గా నిర్ణయించారు.

వేసవి సెలవులు మార్చి 30 నుంచి జూన్ 1, 2025 వరకు కొనసాగుతాయి.



### బిషప్ తుమ్మబాలకు
# సిఎం రేవంత్ నివాళి


**హైదరాబాద్,మే31(నమస్తే ఉదయం):** సికింద్రాబాద్ సెయింట్ మేరీ స్కూల్‌లో విశ్రాంత ఆర్చ్ బిషప్ తుమ్మబాల పార్థివ దేహానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. సమాజ నిర్మాణంలో తుమ్మబాల ఎనలేని సేవలు అందించారని చెప్పారు. ప్రజలకు శాంతి, మతసామరస్యం, విద్యను అందించారని తెలిపారు. వ్యక్తిగతంగా ఆయన తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు.

2019 ఎంపీ ఎన్నికల్లో, 2023 శాసనసభ ఎన్నికల్లో తమను మంచి మనసుతో ఆశీర్వదించారని చెప్పారు. వారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఆయన మరణం వారి అభిమానులకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని చెప్పారు. వారి సేవలను కొనియాడుతూ.. వారి సందేశ స్ఫూర్తితో ముందుకు సాగాలని తెలిపారు.

# సూర్య ప్రతాపం...

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తర అంబాజరీ రోడ్డులోని ఐఎండీ కేంద్రంలో రికార్డు స్థాయిలో 56 డిగ్రీలు నమోదైంది. మిగతా రెండు స్టేషన్లలో 44 డిగ్రీల ఎండలు ఉన్నట్లు రికార్డయ్యింది. ఇటీవల దిల్లీలోని ముంగేష్‌పుర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. దిల్లీ చరిత్రలో ఇదే అత్యధికం కావడంతో వాతావరణ శాఖ స్పందిందించి. ఆ వాతావరణ స్టేషన్‌లోని సెన్సార్ సరిగా పనిచేస్తుందో, లేదో



తనిఖీ చేస్తున్నట్లు తెలిపింది. ఈ పరిణామాల వేళ ఇప్పుడు నాగ్‌పుర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడం మరోసారి చర్చకు దారితీసింది. ఇక్కడా సెన్సార్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది. మరోవైపు తీవ్రమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇప్పటికే వడదెబ్బ కారణంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా బిహార్‌లో 32 మంది మృతి చెందగా.. ఒడిశాలో 10, ఝార్ఖండ్‌లో 5, రాజస్థాన్‌లో ఐదుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు, దిల్లీలో ఒకరు మరణించారు. రానున్న రెండు రోజుల్లో యూపీ, దిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వడగాలులు తీవ్రంగా ఉన్నందున దేశంలో జాతీయ ఎమ్జర్గ÷న్సీని విధించే అవకాశాలను పరిశీలించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది.

మరోవైపు, దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించడం కాస్త ఊరటనిచ్చే విషయం. గురువారం కేరళ తీరాన్ని తాకిన ఈ రుతుపవనాలు.. ప్రస్తుతం దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరిస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇవి మిగతా ప్రాంతాలకు విస్తరించే అవకాశముంది. దీంతో శనివారం నుంచి వడగాలుల తీవ్రత కాస్త తగ్గొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

### అట్టహాసంగా
# దశాబ్ది వేడుకల ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

కూడా చేశారు. ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులకు ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని సీఎస్ శాంతి కుమారి అన్నారు. శుక్రవారం సీఎస్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..జూన్ 1వ తేదీ సాయంత్రం నుంచే ట్యాంక్ బండ్ పై స్టాళ్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జూన్2న రాత్రి 11 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. 2వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు ట్యాంక్ బండ్ పై వెలుగులు విరజిమ్మే క్రాకర్స్, పటాకులు కాల్చుతారని, కార్నివాల్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. ఈ క్రమంలో పరేడ్ గ్రౌండ్ మొత్తం డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కలెక్టర్ అనుదీప్, పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆవిర్భావ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని సీఎస్ శాంతి కుమారి తెలిపారు.

జూన్2న ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని సీఎస్ చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై 5వేల మందితో ఎ÷-లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ప్రజలంతా ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సీఎస్ కోరారు. శనివారం సాయంత్రం 5 గంట నుంచి ప్రజలను ట్యాంక్ బండ్‌కు అనుమతిస్తారని తెలిపారు. వేడుకలకు భారీగా ఏర్పాట్లు చేశామని, ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఫైర్‌వర్క్స్, కార్నివాల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా నియామక పత్రాలు తీసుకున్న వారితో ఓ కార్యక్రమానికి ప్లాన్ చేసినట్లు సీఎస్ శాంతి కుమారి తెలిపారు.

## జూన్ 7,8న ప్రపంచ వరి సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి వివిధ ఉత్పత్తుల లభ్యతపై వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు.భారతదేశంలోనే తొలిసారిగా ప్రపంచ వరి సదస్సు-2024కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది.

ఈ సదస్సు బియ్యం ఎగుమతులను ప్రోత్సహించడం, భారతదేశం, తెలంగాణ నుంచి బియ్యం రకాలను ప్రదర్శించడం, విజ్ఞాన వేదికను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇంటర్నేషనల్ కమోడిటీ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో జరుగుతుంది.



మహిళా కుట్టు శిక్షణ కేంద్రంలో యూనిఫాములను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక్

# విద్యార్థుల దుస్తులను నాణ్యతతో త్వరగా అందించాలి

## చిలుకూరులో సందర్శించిన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్

**మొయినాబాద్ మే 31(నమస్తే ఉదయం):** పాఠశాల ప్రారంభం కంటే ముందే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న దుస్తులను నాణ్యతతో అందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ అన్నారు.

శనివారం మండల పరిధిలోని చిలుకూరు గ్రామంలో గల గ్రామీణ పేదరిక నిర్మూలన సమస్త జిల్లా గ్రామీణ అభివృద్ధి సమస్త ఆధ్వర్యంలో కొనసాగుతున్న చిలుకూరులోని మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శశాంక సందర్శించి పరిశీలించారు ఈ సందర్భంగా కుట్టు శిక్షణ కేంద్రంలో ఉన్న మహిళలతో ఆయన ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం పాఠశాల యూనిఫామ్‌ను పాఠశాల ప్రారంభించక ముందే సిద్ధంగా ఉండాలని ఆయన తెలిపారు.

ఆయన సందర్శించిన సమయంలో మహిళా సమైక్య అధ్యక్షుడు రవీందర్, గ్రామ కార్యదర్శి , వెంకటేష్, కుట్టు శిక్షణ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### సహకార సంస్థల్లో సభ్యుల భాగస్వామ్యాన్ని

# బలోపేతం చేయాలి..

## రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి శ్రీనివాస్




**రాజేంద్రనగర్,మే31(నమస్తే ఉదయం):** సహకార సంస్థల్లో సభ్యుల భాగస్వామ్యాన్ని సంస్థల ఆర్థిక బలోపేతం కావడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు కాలానుగుణంగా అందు బాటులో ఉన్న సాంకేతికతను ఉపయోగించుకోవాలని రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి శ్రీనివాస్ తెలిపారు.గురువారం రాజేంద్రనగర్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ కోపరేటివ్ మేనేజ్ మెంట్ ఆవరణలో ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో సహకార సంస్థల ఆర్థిక బలోపేతానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు,అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. అడ్వైజరీ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన అడిషనల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీస్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... జవాబుదారితనం పారదర్శకత సహకార స్ఫూర్తి కలిగిన అంశాలు మాత్రమే సహకార రంగం యొక్క బలోపేతానికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.రెండు తెలుగు రాష్ట్రాల్లోని సహకార సంఘాలు భారత ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న అమలు కాబడుతున్న పథకాల ద్వారా ఆర్థిక వనరులను పెంపుందించుకోవాలని పిలుపునిచ్చారు. పూర్తి కంప్యూటరీకరణ జరగాలని తద్వారా సభ్యులకు పారదర్శకతతో కూడిన సేవలు అందించడం సులభం అవుతుందని అన్నారు.

ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ బికే బెహరా ముఖ్య కార్యనిర్వాహన అధికారి నేషనల్ ఫిషరీస్ డెవలప్ మెంట్ మాట్లాడుతూ...ప్రభుత్వ సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలు,నూతన కార్మిక సహకార సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.డాక్టర్ గణేశన్ డైరెక్టర్ మెంబెర్ కన్వీనర్‌గా సంస్థ చేపట్టిన కార్యక్రమాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ కార్యక్రమంలో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల అధికారులు, ఇఫ్కో అధికారులు, మహేష్ కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్,తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ డిపార్టుమెంటు అధికారులు పాల్గొన్నారు.





# ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారులు...

**వనపర్తి,మే 31(నమస్తే ఉదయం):** లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ అధికారులు ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగింది.ఇందుకు సంబంధించి ఏసీబీ అధికారులు విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తకోటలో సీఎంఆర్ రెస్టారెంట్ ఆవరణలో విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్,స్తంభాలు,తదితరాలకు సంబంధించిన కాంట్రాక్టు పనులను అధికారులు ప్రవీణ్ కుమార్ కు అప్పగించారు.పనులు పూర్తి చేసిన తర్వాత రూ.2,11,421 ప్రవీణ్ కుమార్ కు విద్యుత్ శాఖ ద్వారా బిల్లు రావలసి ఉంది.ఈ బిల్లులను మంజూరు చేయాలి అంటే తమకు లంచం ఇవ్వాలి అని అధికారులు డిమాండ్ చేశారు.ఎంతగా చెప్పిన బిల్లు మంజూరు చేయకపోవడంతో.. అతను ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.ఈ మేరకు శుక్రవారం ఏసీబీ అధికారులు వనపర్తికి చేరుకొని ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారము సంబంధిత అధికారులకు డబ్బులను ప్రవీణ్ కుమార్ ద్వారా పంపించారు.

అధికారులు ఆ డబ్బులను తీసుకున్న వెంటనే ఏసీబీ అధికారులు రంగ ప్రవేశం చేసుకొని విద్యుత్ శాఖ అధికారుల నుండి డబ్బులను స్వాధీన పరుచుకున్నారు. వనపర్తి విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.నాగేంద్ర కుమార్,డివిజనల్ అసిస్టెంట్ ఇంజనీర్ (టెక్నికల్), డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) ఎం.నరేంద్ర కుమార్ ను అదుపులోకి తీసుకున్నారు.సాయంత్రం నుండి రాత్రి వరకు ఏసీబీ అధికారులు విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉండి పూర్తి ఆధారాలతో విద్యుత్ శాఖ అధికారులను అదుపులోకి తీసుకోవడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశం మారింది. మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బీఎస్ కృష్ణ గౌడ్,ఇన్స్పెక్టర్లు సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని,లింగస్వామి ఇద్దరు ఫిర్యాదు దారులతో కలిసి దాడులు నిర్వహించారు.

# పొగ త్రాగడం వలన ఆరోగ్యానికి హానికరం..

## అరంఘర్ చౌరస్తాలో ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవ ర్యాలీ : జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్ రావు




**రాజేంద్రనగర్,మే31(నమస్తే ఉదయం):** ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ అరంఘర్ చౌరస్తాలో జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్ రావు ఆధ్వర్యంలో పొగాకు విరమణ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా సిగరెట్టు,ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దష్ప్రభావాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్ రావు అవగాహన కల్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ...

ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం ఏర్పాటు చేసి పొగాకు వలన సంభవించే వ్యాధులపై వివరించడం జరిగిందని చెప్పారు.పొగాకు తీసుకోవడం వలన వాటిలో ఉండే రసాయనాలు వలన మెదడు గుండె ఊపిరితిత్తులు రక్తప్రసరణ తగ్గుతుందని అన్నారు. దీంతోపాటు నరాల బలహీనత కలగ చేస్తుందని వివరించారు.ప్రజలు మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలన్నారు.

పొగ త్రాగడం వలన ఆరోగ్యానికి హానికరమని మీరు కాలుస్తున్నది సిగరెట్టు కాదని మీ జీవితాన్ని అని ప్రజలకు తెలియ పరచాలని సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు రాకేష్, రేఖ, వందన, ఫిరోజుద్దీన్, స్వాతి, చేతన్, సంగీత, సిహెచ్‌ఓ సిరాజుద్దీన్,హెచ్ ఇఓ కేశవ్,హెచ్ ఎస్ శివకుమార్, సురేష్,వైద్య అధికారులు, సూపర్ వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

### ఇకపై ప్రైవేట్ స్కూళ్లలో యూనిఫామ్,

# బూట్లు, బెల్ట్ అమ్మడం నిషేధం..

**రాజేంద్రనగర్,మే 31(నమస్తే ఉదయం):** ప్రైవేటు స్కూళ్లలో యూనిఫామ్‌లు,బూట్లు,బెల్టుల అమ్మకాలపై ప్రభుత్వం నిషేధం విధించింది.స్టేషనరీ, పుస్తకాల వంటివి లాభాపేక్ష లేకుండా అమ్ముకోవచ్చని తెలిపింది.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.ఈ మేరకు హైదరాబాద్ డీఈవో ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల (రాష్ట్ర, సీబీఎస్సీ, ఐసీఎస్సీ) ప్రాంగణాల్లో యూనిఫారాలు, షూస్,బెల్ట్ అమ్మడానికి వీల్లేదని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం పాఠశాల కౌంటర్‌లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు ఏవైనా ఉంటే..అవి వాణిజ్యేతరంగా, లాభాపేక్ష లేకుండా ఉండాలని తెలిపారు.ప్రైవేట్ స్కూళ్లను క్రమం తప్పకుండా పర్యవేక్షించేందుకు మండల స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లకు ఆదేశాలు జారీ చేశారు. స్కూళ్లలో యూనిఫారాలు,షూ,బెల్ట్ మొదలైనవాటి క్రయ విక్ర యాలు జరుగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.






డి. సుధారాణి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమెను సన్మానిస్తున్న వికారాబాద్ జిల్లా అధికారులు




వికారాబాద్ జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన డి. సుధారాణి, తదితరులు

# వికారాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డి.సుధారాణి ఉద్యోగ విరమణ

## సన్మానించి వీడ్కోలు పలికిన జిల్లా అధికారులు

**రాజేంద్ర నగర్, మే31(నమస్తే ఉదయం):** వికారాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణిగా పనిచేస్తున్న బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీకి చెందిన కరుణాకర్ రెడ్డి సతీమణి డి సుధా రాణి శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. 1993లో కర్నూలు జిల్లా పత్తికుంట లో ఐసిడిఎస్ సూపర్వైజర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన సుధారాణి అంచెలంచెలుగా ఎదిగి వికారాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి స్థాయికి ఎదిగారు. 1993 నుంచి 1995 వరకు ఆమె ఐసిడిఎస్ సూపర్వైజర్ గా కొనసాగారు. పత్తికుంట, అమన్ గల్ ప్రాంతాలలో పని చేశారు. 1996లో మహబూబ్ నగర్ సర్వ మండలం ఎంపీడీవో గా పదోన్నతి పొందారు.

ఆ తర్వాత 2002 - 2004 వరకు చిన్న చింత కుంట మండలం, 2004 - 07 వరకు అణ్వాడ మండలం, 2007 నుంచి 2013 వరకు షాద్ నగర్ మండలం లో ఎంపీడీవో గా విధులు నిర్వహించారు. అనంతరం కొత్త కోట కు బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని బంటారం, పూడూర్ మండలంలో విధులు నిర్వహించారు.

### వరంగల్ రూరల్ డిప్యూటీ సీఈవోగా...

2019లో వరంగల్ రూరల్ డిప్యూటీ సీఈవోగా పదోన్నతిపై వెళ్లారు. అక్కడ నుంచి ఆమె వికారాబాద్‌కు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బదిలీ అయి వచ్చారు.

### అందరితో కలిసిమెలిసి ఉండే సుధారాణి :

వికారాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారినిగా పనిచేసిన డి సుధారాణి జిల్లాలో అందరితో కలిసిమెలిసి ఉండేవారని పలువురు గుర్తు చేసుకున్నారు.

జిల్లాకు చెందిన అధికారులు వినయ్, జ్యోతి తదితరులు మాట్లాడుతూ, జిల్లాలో అందరితో కలుపుగోలుగా ఉంటూ విధులు నిర్వహించిన డి సుధారాణి శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్థిస్తున్నా మన్నారు. శాలువా, పూలమాలలు, మెమెంటోలతో సుధా రాణిని ఘనంగా సన్మానించారు.





గోదాం భవన పరిస్థితిని పరిశీలిస్తున్న కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదన కలెక్టర్

# విత్తనాల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## - జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**కొత్త కోట,మే31(నమస్తే ఉదయం):** వర్షాకాలం సాగుకు అవసరమైన నాణ్యమైన పత్తి, వరి విత్తనాలు డీలర్ల దగ్గర అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందన వసరం లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శుక్రవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలకేంద్రంలోని మన గ్రోమోర్, కేంద్రంలోని అగ్రి రైతు సేవ కేంద్రం, జై కిసాన్ దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు, అమ్ముడు అయిన వాటి రికార్డులను పరిశీలించారు.ఎక్కువగా ఏ బ్రాండ్ విత్తనాలకు డిమాండ్ ఉంది అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వర్షాకాలం పత్తి సాగుకు సరిపడా నాణ్యమైన పత్తి, వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. జిల్లాకు 14,350 పత్తి విత్తనాల పాకెట్స్ రాగా, అందులో ఇప్పటివరకు కేవలం 2,512 అమ్ముడయ్యాయని తెలిపారు. విత్తనాలకు సంబంధించి ఎక్కడైనా కొరత ఉంటే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ హెల్ప్ లైన్ నెంబర్ 08545 233525 కి కాల్ చేయమని సూచించారు.

కంట్రోల్ రూమ్‌లో స్టాక్ పోసిషన్ వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు. విత్తనాల విషయంలో రైతులను మోసం చేసే ఘటనలు చోటుచేసుకోకుండా మండలాల వారీగా తనిఖీ వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆయా బృందాలు ఎప్పటికప్పుడు తనిఖీ లు చేసి నాసిరకం విత్తనాలు అమ్మే వారిని గుర్తించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.ఎవరైనా నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.లేబుల్, పాకింగ్ లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డీలర్లను హెచ్చరించారు. ఫర్టిలైజర్స్‌కు సంబందించి సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రభుత్వ బడుల్లో మరమ్మత్తులను పరిశీలించారు.ప్రభుత్వ బడుల్లో పిల్లలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద మరమ్మత్తు పనులు వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆత్మకూరు మండలకేంద్రంలోని వడ్డేగేరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జడ్పీ హెచ్ఎస్ ఉర్దూ పాఠశాల ను సందర్శించారు. బడుల్లో మరమ్మత్తు పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు.

పనుల నిర్వహణలో ఎక్కడా అలసత్వానికి తావివ్వ కూడదని అధికారులకు సూచించారు. తాగునీటి వసతి, వంట గది, మరుగుదొడ్ల సహా అన్ని పక్కాగా ఉండేలా మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వెంటజిల్లా వ్యవసాయ అధికారి డి చంద్రశేఖర్, కొత్తకోట ఏడిఏ దామోదర్, ఆత్మకూరు తహసీల్దార్ రాజు, ఎం.ఈ.ఓ భాస్కర్, ఎం.పీ.ఓ నర్సింగ్ రావు, ఎం.పీ.డి.ఓ సుజాత, ఏ.ఈ.ఓ మహేశ్వరి, ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.





## పట్టుబడ్డ కుషాయిగూడ

# సీఐ, ఎస్సై

**కుషాయిగూడ,మే31(నమస్తే ఉదయం):** హైదరాబాద్ నగరంలోని కుషాయిగూడ సీఐ వీరాస్వామి,ఎస్సై షఫీ ఏసీబీకి చిక్కారు.ఒక కేసుకు సంబంధించి రూ.3 లక్షలు తీసుకుంటుండగా వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.భూవివాదానికి సంబంధించిన ఓ కేసు సెటిల్‌మెంట్ చేయడానికి కుషాయిగూడ ఎస్సై,సీఐ లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు.బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు పక్కా ప్లాన్ వేసుకున్నారు.ఈ క్రమంలో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. రూ.3 లక్షలు లంచం తీసుకుంటుండగా సీఐ వీరాస్వామి,ఎస్సై షఫీ,ఓ కానిస్టేబుల్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌లోనే విచారిస్తున్నారు. దాదాపు రెండు గంటలుగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ సోదాలు కొనసాగాయి.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# నేడు విద్యుత్తు లేని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, మే31(నమస్తే ఉదయం):** శివరాంపల్లి విద్యుత్తు సెక్షన్ పరిధిలోని డ్రీమ్ వ్యాలీ విద్యుత్ ఫిల్టర్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి 1:00 వరకు, భవాని కాలనీ లో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ హరినాథ చారి తెలిపారు.

**శంషాబాద్‌లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని సుల్తాన్పల్లి విద్యుత్తు పీడన పరిధిలో శనివారం ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, నక్కూడా విద్యుత్ ఫీడర్ పరిధిలో ప్రాంతాలైన సుల్తాన్‌పల్లి కె.వి దొడ్డి బ్యూటీ గ్రీన్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, నర్కూడ అమ్మపల్లి చౌదర్ గూడా సిరిసిరి మక్త ప్రాంతాలలో సరఫరా నిలిపి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.

**షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో...**

వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యుత్ ఫీడర్ , కాచారం విద్యుత్ ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5:00 వరకు, మల్కారం విద్యుత్ ఫ్రీడర్ పరిధిలో కాచారం, వర్ధమాన్ కాలేజ్, మల్కారాం విలేజ్ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5 వరకు వరకు చెట్ల కొమ్మలను తొలగించటానికి విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు.

**ఇబ్రహీం బాగ్ సెక్షన్లో...**

ఇబ్రహీం బాగ్ విద్యుత్తు సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లక్ష్మీ నగర్ అంజలి గార్డెన్ ఎల్ఐసి కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు నుండి సాయంత్రం నాలుగున్నర వరకు ఫ్రెండ్స్ కాలనీ,పోకర్ వాడ, తానాష నగర్, హుడా కాలనీ, పీజీ కాలేజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర వరకు డోలార్ హిల్స్, తిరుమల హెల్స్ నగర్ పీజీ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

**గగన్ పహాడ్‌లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని ఇందిరాగాంధీ హౌసింగ్ సొసైటీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన పద్మశాలి పురం, మధువన్ కాలనీ, ఆప్కో కాలనీ, భాయ్ కాలనీ ప్రాంతాలలో శనివారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మీనాక్షి కెమికల్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మీనాక్షి కెమికల్స్, మెట్రో హిల్స్, సుమో ఫుడ్స్, ప్రాంతాలలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 4:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జుబేదుద్దీన్ తెలిపారు.

విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.




గోల్కొండ ఏ డి ఈ వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డి ఈ ఫరహత్ అలీ

## పదవి విరమణ చేసిన గోల్కొండ ఏ డి ఈ వెంకటేశ్వర్లకు ఘనంగా సన్మానం

**మెహిదీపట్నం, మే31(నమస్తే ఉదయం):** మెహదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని గోల్కొండ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ గా పనిచేసిన వెంకటేశ్వర్లు శుక్రవారం పదవి విరమణ చేశారు. పదవి విరమణ చేసిన వెంకటేశ్వర్లు డి ఈ లు సి శ్యాంసుందర్ రెడ్డి, జి శ్రీనివాసరెడ్డి, ఫరహాత్ అలీ లు ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విధినిర్వణలో వెంకటేశ్వర్లు చేసిన సేవలను కొనియాడారు. వెంకటేశ్వర్లు శేష జీవితం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ డి ఈ లు నరసింహారెడ్డి, మల్లేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




ఏడిఈ వెంకటేశ్వర్లు పదవి విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డి శ్యాంసుందర్ రెడ్డి

# ప్రజలకు 200 కోట్ల కుచ్చుటోపీ

## కో ఆపరేటివ్ బ్యాంక్ జిఎం నిమ్మగడ్డ వాణిబాల అరెస్ట్

## భర్త నేతాజీ, కుమారుడు శ్రీహర్ష కూడా అరెస్ట్

**హైదరాబాద్,మే31 (నమస్తే ఉదయం):** డిపాజిట్ల పేరుతో రూ.200 కోట్లకు కుచ్చుటోపి పెట్టిన కేసులో ప్రధాన నిందితురాలు తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ నిమ్మగడ్డ వాణిబాలను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆమె భర్త మెకా నేతాజీ తో పాటు అతని కుమారుడు శ్రీ హర్షను కూడా అరెస్ట్ చేశారు. తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంకులో పనిచేసే 140 మంది ఉద్యోగులను వాణి బాల మోసం చేశారు. ఆమె మాటలు నమ్మిన ఉద్యోగులు 26 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టారు.

ఈ డబ్బు మొత్తాన్ని వాణి బాలకు చెందిన ప్రియాంక ఎంటర్ ప్రైజెస్‌లో డిపాజిట్ చేశారు. శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్ పేరుతో అబిడ్స్‌లోని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న నిమ్మగడ్డ వాణి బాల సుమారు 532 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేశారు. ఆమె భర్త మేక నేతాజీ, కొడుకు మేక శ్రీహర్షలు డిపాజిట్ల సేకరణ చేశారు. నెలకు 24 శాతం రిటర్న్ ఇస్తామని నమ్మబలికారు. మొత్తం 532 మంది నుంచి డిపాజిట్లు వసూలు చేసి ఆ డబ్బులు తీసుకొని పరార్ అయ్యారు. దీంతో వాణి బాలను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విషయం బయట పడడంతో బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ సీసీస్ పోలీసులను ఆశ్రయించారు.

దీంతో వాణి బాల చిట్ ఫండ్ కంపెనీ, శ్రీ ప్రియాంక ఎంటర్ ప్రైజెస్‌పై పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టారు. సుమారు రూ. 200 కోట్ల స్కామ్ జరిగినట్లు గుర్తించారు. ప్రధాన నిందితురాలు నిమ్మగడ్డ వాణిబాలతో పాటు ఆమె భర్త, కొడుకును అరెస్ట్ చేశారు.

TSCAB
Telangana State Co-operative Apex Bank Limited



**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.